క్లుప్తంగా

రౌడీ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి



ఇబ్రహీంపట్నం: రౌడీ షీటర్లు, సస్పెక్ట్ షీటర్లు సత్ప్రవర్తన కలిగి ఉండాలని నగర క్రైమ్ అడిషనల్ డీసీపీ ఎం.కృష్ణమూర్తి నాయుడు అన్నారు. ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌లో రౌడీషీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. ఒక్కొక్కరిని పేరుపేరునా పలకరించి గతంలో ఏమిచేశారు. ప్రస్తుతం ఏమి చేస్తున్నారనే వివరాలు అడిగారు. రానున్న 2024 సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా ఏవిధమైన చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడవద్దని హెచ్చరించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామన్నారు. నేరప్రవృత్తిని విడనాడి నైతిక విలువలు కలిగి జీవించాలన్నారు. సీఐ ఎం.సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి బోనాల ఉత్సవం

బొర్రగూడెం(మైలవరం): బొర్రగూడెంలోని తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల నెల బోనాల ఉత్సవం సోమవారం నుంచి ఈనెల 27వ తేదీ వరకు వైభవంగా నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి బి. రవీంద్ర బాబు ఒక ప్రకటనలో తెలిపారు. మూడు రోజులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతాయన్నారు.

వైభవంగా పేరంటాలమ్మ జాతర



పేరంటాళ్లగుట్ట(గంపలగూడెం): అచ్చంపేరంటాలమ్మ ఆలయంలో అమ్మవారి జాతర, తిరునాళ్ల ఉత్సవాలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. శనివారం రాత్రి వినగడపలో ప్రారంభించిన గ్రామరాశి ప్రభ ఆదివారం ఉదయం ఆలయం వద్దకు చేరగానే జాతరను ప్రారంభించారు. భక్తులు పొంగలి వండి అమ్మవారికి పసుపు కుంకుమలతో సమర్పించారు. గంపలగూడెం, ఏ కొండూరు, తెలంగాణ రాష్ట్రం ఎర్రుపాలెం మండలాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో హాజరుకావడంతో ఆలయ ప్రాంగణం కిక్కిరిసింది. ఆలయ కమిటీ చైర్మన్ మేచినేని నాగమల్లేశ్వరరావు, సొసైటీ అధ్యక్షుడు పెమ్మిరాజు ఆంజనేయులు, సర్పంచ్ చిమట ఉమాదేవి, ఎంపీటీసీ పరిటాల పద్మ, మీసాల కోటిబాబు పాల్గొన్నారు.

800 మందికి వైద్య పరీక్షలు

తిరువూరు: స్థానిక ఆస్టర్ రమేష్ అమరావతి ఆస్పత్రిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆస్పత్రి మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ బాబు తమ ఆస్పత్రిలో లభిస్తున్న ఆధునిక వైద్య సదుపాయాలను వివరించారు. మారుతున్న జీవన విధానంలో అధికశాతం ప్రజలు రక్తపోటు, మధుమేహం బారిన పడుతున్నారని, నిత్యం వ్యాయామం చేయడం, ఉదయపు నడకతో వీటిని నియంత్రించవచ్చని చెప్పారు. గుండె, ఊపిరితిత్తులు, మూత్రపిండాల వ్యాధులకు రక్తపోటు, మధుమేహం కారణమవుతాయన్నారు. 800 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. అమరావతి ఆస్పత్రి నిర్వాహకుడు కోనేరు వెంకట కృష్ణన్, వైద్యులు పాల్గొన్నారు.

అమ్మవారి తిరునాళ్లకు విస్తృత ఏర్పాట్లు

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మవారి చిన్న తిరునాళ్లకు ఆలయ అధికారులు విస్తృత ఏర్పాట్లు చేశారు. ఐదురోజులపాటు నిర్వహించనున్న ఈ తిరునాళ్ల మహోత్సవాల్లో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. మునేరులో నీరు లేనందున 200 షవర్‌బాత్‌లు ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుద్దీపాలతో అలంకరించడంతోపాటు భక్తులకు ఇబ్బంది లేకుండా బారికేడ్లు ఏర్పాటు చేసినట్లు ఆలయ ఈఈ వైకుంఠరావు, ఏఈ రాజు తెలిపారు. ఆలయం చుట్టూ పందిళ్లు, తాత్కాలికంగా మునేరు ప్రాంతంలో 20 టాయిలెట్లు, కేశఖండనశాల, భక్తుల సౌకర్యార్థం బస్‌షెల్టర్స్ ఏర్పాటు చేశారు. తిరునాళ్ల ప్రాంతం, అమ్మవారి పుట్టినిల్లు అనిగండ్లపాడులో తాత్కాలికంగా సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి భద్రతను పర్యవేక్షిస్తున్నారు. గుడిచుట్టూ చలివేంద్రాల ఏర్పాటుతోపాటు మొబైల్ ట్యాంకర్లతో తాగునీటిని సరఫరా చేయనున్నారు. ఉత్సవాల సందర్భంగా భక్తుల కోసం 1.50 లక్షల లడ్డూ ప్రసాదాలు సిద్ధం చేశామని ఈవో కె.రమేష్‌నాయుడు తెలిపారు. అవసరమైతే మరిన్ని లడ్డూల తయారీకి అవసరమైన ఏర్పాట్లు సిద్ధం చేసినట్లు ఈవో వివరించారు. ఉత్సవాలు జరిగే రోజుల్లో ఆలయం వద్ద రాత్రి సమయంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని ఈవో తెలిపారు.

గరుడసేవ

నందిగామ: పౌర్ణమి నేపథ్యంలో పట్టణ శివారు పల్లగిరిగుట్టపైగల కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయంలో ఆదివారం గరుడ సేవా కార్యక్రమాలు నిర్వహించారు. కల్యాణ వెంకటేశ్వర స్వామి వారికి విశేష పూజలు జరిగాయి. అనంతరం స్వామివారిని, అమ్మవార్లను గరుడ వాహనంపై ఊరేగించారు. పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పూజలు చేశారు.

బీసీల జీవితాల్లో వెలుగులు

- జగనన్న చేదోడు ద్వారా 2,751 మందికి లబ్ధి
- మైలవరం నియోజకవర్గంలో రూ.6.1 కోట్లు నేరుగా చెల్లింపు



ఇబ్రహీంపట్నంలో టైలర్లు



ఇబ్రహీంపట్నంలో బార్బర్ షాపు నిర్వహిస్తున్న జగనన్న చేదోడు లబ్ధిదారుడు

ఇబ్రహీంపట్నం: బీసీల అభ్యున్నతికి జగన్‌మోహన్ రెడ్డి ప్రాధాన్యత ఇస్తూ బీసీల పక్షపాతిగా నిలిచారు. బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్లాస్ కాదని బీసీలంటే సమాజానికి బ్యాక్‌బోన్ అని గుర్తించిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి జగనన్న చేదోడు పథకం ప్రవేశపెట్టారు. ఈ పథకంలో స్వశక్తితో దుకాణాలు ఏర్పాటు చేసుకుని ఎదుగుతున్న రజకులు, నాయీ బ్రాహ్మణులు, టైలర్ల జీవితాల్లో వెలుగులు నింపడం పథకం ప్రధాన ఉద్దేశం. వెనుకబడిన వర్గాల జీవన ప్రయాణంలో ఈ పథకం చేదోడుగా నిలిచింది. సొంత దుకాణాలు ఏర్పాటు చేసుకున్న వారికి ప్రతి ఏడాది రూ.10 వేల చొప్పున అర్హులైన లబ్ధిదారులకు నేరుగా బ్యాంక్ ఎకౌంట్‌లో జమ చేశారు. ఇప్పటికి నాలుగు విడతలుగా ఒక్కొక్కరికి రూ.40 వేలు ప్రభుత్వం ద్వారా 2,751 మందికి రూ.6.1 కోట్లు నేరుగా లబ్ధి చేకూరింది.

అర్హతే ప్రామాణికంగా లబ్ధి

21–60 ఏళ్ల మధ్య వయస్సు గల వారు ఈ పథకంలో లబ్ధి పొందేందుకు అర్హులు. నేరుగా గ్రామ, వార్డు సచివాలయంలో అర్జీలు పెట్టుకుంటే కుల, మత, పార్టీలకు అతీతంగా లబ్ధిదారులను ఎంపికచేసి పథకం ద్వారా నగదు అందజేశారు. మైలవరం నియోజకవర్గం పరిధిలోని రెడ్డిగూడెం, జికొండూరు, మైలవరం, విజయవాడ రూరల్ (ఐదు గ్రామాలు). ఇబ్రహీంపట్నం మండలాల్లో 2,851 మందికి రూ.6.1 కోట్లు నగదును ఎలాంటి వివక్షకు తావులేకుండా, దళారులు లేకుండా నేరుగా బ్యాంక్ ఖాతాల్లో ప్రభుత్వం జమ చేసింది. నాయీ బ్రాహ్మణులు, టైలర్లు, రజకులు వారి వృత్తి పరంగా పొందిన ఆదాయానికి అదనంగా ఏడాదికి రూ.10 వేలు ప్రభుత్వం జమ చేయడంతో వారి కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది. అర్హులై ఉండి ఏ కారణం చేతనైనా సంక్షేమ పథకాల లబ్ధి అందకుంటే ప్రతి ఏడాది మరో అవకాశం ఇచ్చి నగదు జమ చేశారు. ప్రభుత్వం నేరుగా అందిస్తున్న చేదోడు అదనపు ఆదాయంతో దుకాణం కరెంటు బిల్లులు, అద్దె చెల్లింపులు, షాపు సుందరీకరణ, నూతన పరికరాలు సమకూర్చుకుని వ్యాపారాభివృద్ధి చేసుకుంటున్నారు.

గత ప్రభుత్వం పరికరాలతో సరిపెట్టింది

గత టీడీపీ ప్రభుత్వం బీసీలను ఆదరణ పథకంతో నిలువునా ముంచేసింది. గత పాలకుల మాటలు నమ్మిన బీసీలు నిరాదరణకు గురయ్యారు. కేవలం రూ. 1,000 నుంచి రూ.1,500 విలువైన ఇస్త్రీ పెట్టెలు, కుట్టు మిషన్లు, కల్లుగీత పరికరాలు, పాల క్యాన్లు, తోపుడు బండ్లు వంటివి అందజేసి సరిపెట్టారు. ఐదేళ్లలో లబ్ధిదారునికి ఓ పరికరం ఇచ్చి చేతులు దులుపుకున్నారు. అది కూడా జన్మభూమి కమిటీల సిఫార్సులతో టీడీపీ సానుభూతిపరులకు మాత్రమే అవి దక్కేవి. వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గత ప్రభుత్వానికి భిన్నంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ ఇప్పటికి రూ.40 వేల వరకు లబ్ధి చేకూర్చింది. గతంలో కేవలం రూ.1000 విలువైన ఇస్త్రీపెట్టె పొందిన వారు, ఇప్పుడు రూ.40 వేలు అందుకోవడంపై సంతోషం వ్యక్తం చేస్తున్నారు.



షాపు అద్దెకు ఉపయోగ పడ్డాయి

చిన్న దుకాణంలో లాండ్రీ షాపు నడుపుతున్నాను. షాపులో వచ్చే ఆదాయం కుటుంబ ఖర్చులకు సరిపోయేది. అద్దె, కరెంటు బిల్లు చెల్లింపునకు ఇబ్బంది ఎదురయ్యేది. ప్రభుత్వం అమలు చేసిన జగనన్న చేదోడు పథకం ఆదుకుంది. నాలుగేళ్లలో వచ్చిన చేదోడు డబ్బులు రూ.40 వేలు అద్దెకు ఉపయోగపడ్డాయి.

– కె.శ్రీనివాసరావు, లాండ్రీషాపు యజమాని, ఇబ్రహీంపట్నం



కరెంటు బిల్లులకు చెల్లించాను

ఇబ్రహీంపట్నంలో టైలరింగ్ షాపు నడుపుతున్నాను. షాపులో నాతో పాటు మరో ఇద్దరు పని చేస్తున్నారు. ప్రభుత్వ ప్రోత్సాహంతో వ్యాపారం అభివృద్ధి చేసుకున్నాను. జగనన్న చేదోడు డబ్బులు ఇంచుమించు కరెంటు బిల్లులకు సరిపోతున్నాయి. ప్రభుత్వం సహకారానికి కృతజ్ఞతలు తెలుపుకుంటున్నాను.

– ఎస్.సత్యనారాయణ, టైలరింగ్ షాపు యజమాని, ఇబ్రహీంపట్నం

వైఎస్ జగన్‌ను ఆదరించాలి

ఆగిరిపల్లి: రాష్ట్ర అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే త్వరలో జరుగనున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీని గెలిపించుకుని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరో సారి సీఎంగా గెలిపించుకోవాల్సిన అవసరం ఉందని పార్టీ మండల అధ్యక్షుడు పల్లగాని నరసింహారావు అన్నారు. ఆగిరిపల్లి హైస్కూల్ రోడ్డులో ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరిస్తూ వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా మరోసారి మేకా వెంకట ప్రతాప్ అప్పారావును గెలిపించాలని కోరారు. జిల్లా ఉపాధ్యక్షురాలు సుజన కుమారి, ఎంపీటీసీ సాదం గోపి, నాగుల్ మీరా, నాయకులు నక్కన బోయిన పండు, నెరుసు రాజేష్, చిమట శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నేటి నుంచి ఎమ్మెల్యే మేకా ప్రతాప్ ఎన్నికల ప్రచారం

నూజివీడు: వైఎస్సార్ సీపీ నూజివీడు నియోజకవర్గ అభ్యర్థి, ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఎన్నికల ప్రచారం నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తయ్యాయి. మే 13న పోలింగ్ జరగనున్న నేపథ్యంలో ఎన్నికల ప్రచారానికి సిద్ధమవుతున్నారు. సోమవారం నుంచి నిర్వహించే ఎన్నికల ప్రచారాన్ని నూజివీడు పట్టణ పరిధిలోని ఎమ్మార్ అప్పారావు కాలనీ నుంచి సాయంత్రం ఐదు గంటలకు ప్రారంభించనున్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

విస్సన్నపేట: మండలంలోని పలు సబ్‌స్టేషన్ల పరిధిలోని గ్రామాల్లో సోమవారం ఉదయం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ ఏఈ విజయభాస్కర్ తెలిపారు. ఉదయం 10 నుండి 12 గంటల వరకు విద్యుత్తు సరఫరాను నిలిపివేస్తామని చెప్పారు.

ఘనంగా మట్టల ఆదివారం

మైలవరం: మైలవరం, తిరువూరు, నూజివీడు నియోజకవర్గంలో క్రైస్తవులు మట్టల ఆదివారం పండుగను ఘనంగా జరుపుకున్నారు. చర్చిలు, ప్రార్థనా మందిరాల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. మైలవరంలోని పలు ప్రాంతాల్లో మహిళలు, చిన్నారులు, విశ్వాసులు ఈత కొమ్మలను పూలతో అలంకరించి వీధుల్లో తిరుగుతూ యూదులరాజుకు జయము.. జయము అంటూ పాటలు పాడారు. క్రీస్తు దేవాలయాల చుట్టూ మట్టలతో ప్రదక్షిణలు చేసి ప్రార్థనలు నిర్వహించారు.



నూజివీడు పట్టణంలో మట్టల ఆదివారం ఊరేగింపు నిర్వహిస్తున్న క్రైస్తవులు

- **నూజివీడు:** పట్టణంలో మట్టల ఆదివారంను క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఎల్‌ఎఫ్ వ్యవస్థాపకులు బండి ఐజాక్ ఆధ్వర్యంలో అందంగా అలంకరించిన మట్టలతో పట్టణంలోని ప్రధాన వీధుల్లో విశ్వాసులు ఊరేగింపు నిర్వహించారు. కార్యక్రమంలో ఐజాక్, బిస్ కరస్పాండెంట్ బండి శ్యామ్, బండి మెలోడి, కాలి సుగుణరావు, కాలి సురేష్ తదితరులు పాల్గొన్నారు.
- **చాట్రాయి:** మండలంలోని అన్ని గ్రామాల్లో ఆదివారం క్రైస్తవులు మట్టల ఆదివారం పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని ఆర్‌సీఎం, సీఎస్‌ఐ చర్చిల్లో ప్రార్థనలు చేశారు. పలు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. చనుబండ ఆర్‌సీఎం చర్చి ఫాదర్ నరేష్, పోలవరం సీఎస్‌ఐ చర్చి పాస్టర్ సురేష్ తదితరులు పాల్గొన్నారు.
- **ముసునూరు:** ముసునూరు ఆర్‌సీఎం విచారణ సహాయ గురువు రెవ ఫాదర్ గాంధీరాజ ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. చింతలవల్లిలోని ఆర్‌సీఎం చర్చిలో ఉపదేశి బెనర్జీ ఆధ్వర్యంలో పెద్దలు, పిల్లలు, మహిళలు, విశ్వాసులు ర్యాలీలు నిర్వహించారు. ఆర్‌సీఎం, సీఎస్‌ఐ, రక్షణసైన్యం, ఏఎంజీ, తదితర సంఘాల ఫాదర్లు, పాస్టర్లు, సంఘ కాపరులు, ఏసుక్రీస్తు శ్రమల సందేశాలను వినిపించారు.
- **విస్సన్నపేట:** మండలంలోని మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ప్రత్యేక ప్రార్థనలు చేశారు. మట్టలను రంగురంగుల పూలతో అలంకరించి కీర్తనలు పాడుతూ వీధుల్లో ప్రదర్శనలు నిర్వహించారు. స్థానిక సీఎస్‌ఐ టౌన్ చర్చి, ఎల్‌ఎఫ్‌ఎల్ చర్చి ఆధ్వర్యంలో ప్రదర్శనలు జరిగాయి.



మైలవరం వీధుల్లో మట్టల ఆదివారం ర్యాలీ



పోలవరంలో మట్టలతో ర్యాలీ చేస్తున్న క్రైస్తవులు



చింతలవల్లిలో క్రైస్తవుల ప్రదర్శన



కంభంపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

- **తిరువూరు:** తిరువూరు టౌన్ సీఎస్‌ఐ చర్చి ఆధ్వర్యంలో మట్టల ఆదివారం సందర్భంగా పట్టణంలో ఊరేగింపు నిర్వహించారు. తిరువూరు నియోజకవర్గ క్రిస్టియన్ కౌన్సిల్ అధ్యక్షుడు గంటా జయంత్‌బాబు, సీఎస్‌ఐ డీనరీ చైర్మన్ కృపావరం, సంఘస్తులు విలియం, భాస్కరరావు, రవి పాల్గొన్నారు.
- **రెడ్డిగూడెం:** వెలగలగూడెం ఆర్‌సీఎం చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు మట్టల ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈత మట్టలు చేబూని క్రైస్తవులు ర్యాలీ నిర్వహించారు. ఆర్‌సీఎం విచారణ గురువు రెవరెండ్ ఫాదర్ దానియేలు మాట్లాడారు. రెడ్డిగూడెం సీఎస్‌ఐ చర్చి ఆధ్వర్యంలో ప్యారిస్ గురువు రెవ జి. విశ్వనాథ్ ఆధ్వర్యంలో క్రైస్తవులు ఊరేగింపు నిర్వహించారు. రెడ్డిగూడెం మండలంలోని పలు చర్చిలలో ఘనంగా మట్టల ఆదివారం నిర్వహించారు. రెడ్డిగూడెం ప్రధాన సెంటర్‌లో మట్టలను చేబూని ర్యాలీని నిర్వహించారు. పాస్టర్లు అడ్డగట్ల ఇన్నయ్య, టి. బాలస్వామి, క్రైస్తవులు పాల్గొన్నారు.
- **ఏ.కొండూరు:** మండలంలోని పలు గ్రామాల్లో క్రైస్తవులు భక్తిశ్రద్ధలతో మట్టల ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు గ్రామాల్లో ర్యాలీ నిర్వహించారు. కంభంపాడు సీఎస్‌ఐ చర్చి ఆధ్వర్యంలో కంభంపాడు వీధుల్లో ఈతమట్టలను చేబూని హోసన్న జయం, ప్రభువు పేరిట వచ్చువాడు స్తుతింపబడును గాక అంటూ పాటలు పాడుతూ ముందుకు సాగారు. కార్యక్రమంలో ఏ.కొండూరు డీనరీ చైర్మన్ గంటా రాజేశ్వరరావు, పాస్టర్ రాజ్‌కుమార్, సంఘ పెద్దలు కొచ్చర్ల రాజు, క్రైస్తవులు పాల్గొన్నారు.
- **జి.కొండూరు:** మండల పరిధిలోని పలు చర్చిలలో క్రైస్తవులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వెంకటాపురం ఎంఎం మెట్రోపాలిటన్ మిషన్ చర్చి ఆధ్వర్యంలో క్రైస్తవులు ఈత మట్టలను చేబూని ర్యాలీ నిర్వహించారు. సంఘ కాపరి పాస్టర్ ఎస్‌వీ రత్నం, భక్తులు పాల్గొన్నారు.
- **గంపలగూడెం:** మండలంలోని పలు గ్రామాల్లో మట్టల ఆదివారం పర్వదినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. తోటమూల ఆర్‌సీఎం చర్చి, ఊటుకూరు సీఎస్‌ఐ చర్చిల ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాల్లో విశ్వాసులు మట్టలను చేబూని ప్రదర్శనలో పాల్గొన్నారు. విశ్వాసులు క్రీస్తు గీతాలను ఆలపిస్తూ ప్రదర్శనలో పాల్గొన్నారు.
- **ఇబ్రహీంపట్నం:** మండలంలోని వివిధ గ్రామాల్లో ఆర్‌సీఎం, సీఎస్‌ఐ తదితర చర్చీల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. దేవుని వాక్యపరిచర్య చేశారు. అనంతరం మ్రానికొమ్మలకు పూలు అలంకరించి ర్యాలీ నిర్వహించారు. పెద్దలతో పాటు చిన్నారులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లోని చర్చి సంఘ పెద్దలు పాల్గొన్నారు.
- **తిరువూరురూరల్:** తిరువూరు మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం మట్టల ఆదివారం నిర్వహించారు. మల్లేల సీఎస్‌ఐ చర్చిలో ప్రత్యేక ప్రార్థనల అనంతరం సంఘస్తులు గ్రామంలో ప్రదర్శన జరిపారు. మునుకుళ్ల గ్రామంలోని పలు చర్చిలలో మట్టల ఆదివారం ప్రార్థనలను నిర్వహించారు. ఏసుక్రీస్తుకు జయం జయం అంటూ క్రైస్తవ గీతాలు ఆలపిస్తూ ప్రదర్శనలో పాల్గొన్నారు.



తిరువూరులో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు



ఊటుకూరులో ప్రదర్శనలో పాల్గొన్న విశ్వాసులు



వెంకటాపురం గ్రామంలో ర్యాలీ నిర్వహిస్తున్న క్రైస్తవులు

తిరువూరులో పోలీసుల కవాతు



తిరువూరు: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తిరువూరు పట్టణంలో ఆదివారం పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. రాజుపేట నుంచి బైపాస్‌రోడ్డు వరకు ప్రధాన వీధుల మీదుగా సీఐఎస్ఎఫ్ బెటాలియన్ కానిస్టేబుళ్లతో పోలీసులు ఈ ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నిబంధనలు పాటించాలని, బహిరంగ ప్రదేశాల్లో అనుమతి లేకుండా సభలు, సమావేశాలు జరపరాదని సీఐ అబ్దుల్ నబీ సూచించారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు వేణుమాధవుని కల్యాణం

నెమలి(గంపలగూడెం): నెమలి వేణుగోపాలస్వామి దేవస్థానంలో వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడో రోజు సోమవారం స్వామి కల్యాణ మహోత్సవం జరుగుతుంది. కల్యాణం తిలకించేందుకు ఉమ్మడి కృష్ణా, తెలంగాణ రాష్ట్రం ఖమ్మం జిల్లా, హైదరాబాద్, వరంగల్ నుంచి పెద్దసంఖ్యలో భక్తులు హాజరవుతారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేస్తారు.

అదుపుతప్పి ఆటో బోల్తా

ఊటుకూరు(గంపలగూడెం): అదుపు తప్పి ఆటో బోల్తా పడింది. ఈ ఘటన ఊటుకూరు–తిరువూరు రహదారిలో ఆదివారం చోటుచేసుకుంది. తిరువూరులో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న మాదిగల ఆత్మీయ సమావేశంలో పాల్గొనేందుకు ఊటుకూరు నుంచి ఓవర్‌లోడ్‌తో వెళుతున్న ఆటో ఊరుబయటకు వెళ్లగానే అదుపుతప్పి పొలాల్లోకి దూసుకెళ్లి బోల్తా కొట్టింది. ఎవ్వరికీ గాయాలు కాలేదు. ఆటోలో ప్రయాణిస్తున్న వారిని వెంటనే వేరే వాహనాల్లో తరలించారు. ఇదిలాఉండగా ఇదే కార్యక్రమానికి ఓవర్‌లోడ్‌తో వెళుతున్న మరో వాహనాన్ని తోటమూల–తిరువూరు నడుమ ఎంసీసీ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

నేడు కల్యాణం

ముసునూరు: లోపూడి శివారు బాసవరప్పాడులో గోపయ్య సమేత లక్ష్మీ తిరుపతమ్మ కల్యాణం, మండల కేంద్రం ముసునూరులోని అలివేలు మంగమ్మ, వెంకటాచల స్వామివార్ల కల్యాణాన్ని సోమవారం వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీల సభ్యులు ఆదివారం తెలిపారు. సోమవారం ఉదయం కల్యాణం, అనంతరం అన్నదానం, ఊరేగింపు ఆలయ కమిటీల ఆధ్వర్యంలో నిర్వహిస్తామని చెప్పారు.

క్షయ రహిత సమాజాన్ని నిర్మిద్దాం

నూజివీడు: రెండు వారాల పాటు తెమడతో కూడిన దగ్గు వస్తుంటే తప్పనిసరిగా టీబీ పరీక్ష చేయించుకోవాలని టీబీ యూనిట్ వైద్యాధికారి ఎ.దుర్గా భవాని అన్నారు. పట్టణంలోని టీబీ యూనిట్, పీపీ యూనిట్, ఏరియా ఆస్పత్రుల సంయుక్త ఆధ్వర్యంలో ప్రపంచ టీబీ నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి మాట్లాడుతూ వ్యాధి లక్షణాలను వివరించారు. ఏరియా ఆస్పత్రిలో టీబీ పరీక్ష చేసేందుకు అధునాతన పరికరాలున్నాయన్నారు. పరీక్షలలో టీబీ నిర్ధారణ జరిగితే అటువంటి వారికి ప్రభుత్వమే మందులను ఉచితంగా అందిస్తుందని, వాటిని క్రమం తప్పకుండా వాడితే పూర్తిగా తగ్గిపోతుందన్నారు. ప్రతిఒక్కరూ అవగాహన కలిగి క్షయ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఏవీఆర్ మోహన్, టీబీ యూనిట్ సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



రోగులకు మందులు అందజేసిన టీబీ యూనిట్ సిబ్బంది

దిగవల్లి పీహెచ్‌సీ పరిధిలో..

దిగవల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవం సందర్భంగా ఆదివారం టీబీ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామంలో వైద్య సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి శ్రీనివాస్, సీహెచ్ఓ షేక్ దావల్‌బీ, వైద్య సిబ్బంది, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

భారీ మెజారిటీతో గెలిపించాలి

విజయవాడ ఎంపీ కేశినేని నాని



జి.కొండూరు: సామాన్యుడైన సర్నాల తిరుపతిరావును మైలవరం చరిత్రలో కనీవినీ ఎరుగని మెజారిటీతో గెలిపించి మైలవరం సీటును సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి బహుమతిగా అందించాలని విజయవాడ ఎంపీ కేశినేని శ్రీనివాస్ (నాని) అన్నారు. వెలగలేరు గ్రామంలోని చనమోలు వెంకట్రావు కల్యాణ మండపంలో స్థానిక నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఎంపీ మాట్లాడుతూ ఈ ఐదేళ్ల ప్రజలందరూ అందుకుంటున్న సంక్షేమ పథకాలు యథావిధిగా కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసేందుకు సహకరించాలన్నారు. నియోజకవర్గ అభ్యర్థి సర్నాల తిరుపతిరావు మాట్లాడుతూ ఈ ఎన్నికలలో సామాన్యుడైన తనకు మైలవరం నియోజకవర్గ ప్రజలు ఇచ్చే తీర్పు చరిత్రలో గుర్తుండిపోవాలన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండే తనకే మద్దతు తెలపాలని కోరారు. జగనన్న ఆశయాల సాధనకు కృషి చేస్తానని చెప్పారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా పాలన కొనసాగాలంటే ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీకే మద్దతు తెలపాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.